క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం ఓ భక్తుడు రూ.50,000 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. మంత్రాలయం వాస్తవ్యులు మురారి ప్రహ్లాదయ్యశెట్టి వారి కుటుంబ సభ్యులు నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు.

ర్యాంకర్లను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని బీమా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఏపీ ఈసెట్‌లో జి.అరవింద్ 11వ ర్యాంకు, కె.రాహుల్ 202వ ర్యాంకు సాధించారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటికి పిలిపించుకుని అభినందించారు. విద్యార్థులకు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ముమ్మరంగా సబ్‌స్టేషన్ పనులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని జగనన్న కాలనీలో 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కాలనీలో 9327 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. మొదటి దశలో భాగంగా 5,937 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ ఇళ్లకు భవిష్యత్తులో విద్యుత్తు సమస్య తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టిందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ యల్లప్ప తెలిపారు. సమీప గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా పనులను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వంనిర్ణయించిన గడువులోపు పనులను పూర్తి చేసేందుకుచర్యలుతీసుకుంటున్నట్లు చెప్పారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామంలో ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ నర్సమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, ఇన్‌చార్జ్ నర్సప్ప తెలిపారు. గ్రామానికి తాగునీరు అందించే హనువాళు రక్షిత మంచినీటి ఎస్ఎస్ ట్యాంకులో నీరు లేకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. సత్వర చర్యలు చేపట్టి మూడు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకుకు నీరు వచ్చే వరకు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు.

శ్రీ మఠంలో ఆర్టీఐ కమిషనర్

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు ఆర్టీఐ కమిషనర్ రేపల్లె శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీమఠంలో నిర్వహించే రథోత్సవంలో పాల్గొన్నారు. అంతకుముందు వీరికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈయనతో పాటు ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, ఏసీ రామాంజినేయులు, ఈఓ హనుమంతరావు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించండి

కౌతాళం: మండలంలో ఉపాధి పనులపై అలసత్వం చేయకుండా పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏపీఓ జుబేర్‌తో కలిసి టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి పనులోల లేబర్ రిపోర్టింగ్ సమగ్రంగా ఉండాలన్నారు. హార్టికల్చర్, పిట్టింగ్ ప్లాంటేషన్, ఆధార్ ఆథెంటికేషన్ వంటి వాటిని పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు పనులు కల్పించడం వంటి వాటిపై చర్చించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ కూలీలకు కనీస వేతనం అందేలా చూడాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్మల, ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్, తిరుమలేష్, కంప్యూటర్ ఆపరేటర్స్ విజయ్‌శేఖర్, తిప్పన్న, ఆనంత పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంతోషం



ఆదోనిలో సర్టిఫికెట్లను అందుకున్న లబ్ధిదారులతో అధికారులు

ఆదోని టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంతో సులువుగా వివిధ రకాల ధ్రువపత్రాలు అందుతుండడంతో ప్రజలు, లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఆదాయ, కుల, జనన, మరణ, నివాసం, కుటుంబ విభజన రేషన్‌కార్డులను పొందుతున్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులోని కృష్ణా కళ్యాణమండపంలో 10వ వార్డు నుంచి 15వ వార్డులకు సంబంధించి సచివాలయ పరిధిలోని ప్రజలు, లబ్ధిదారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం లక్ష్యాన్ని వివరించారు. చైర్‌పర్సన్ శాంత, వైస్ చైర్మన్ అబ్దుల్‌గౌస్ పాల్గొన్నారు.

వార్డుల వారీగా సమస్యల పరిష్కారం

పదో వార్డులో 727 దరఖాస్తులు రాగా, అందులో 700 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. అందులో కుల ధ్రువీకరణ పత్రాలు 457, ఆదాయ సర్టిఫికెట్లు 250, ఆధార్ అనుసంధానం-7, కుటుంబ విభజన-2, రేషన్‌కార్డులకు సంబంధించి 4, కొత్త పింఛన్లు 2 మంజూరయ్యాయి.

- 11వ వార్డులో 295 సమస్యలు పరిష్కారం
- 12వ వార్డులో 862 దరఖాస్తులకుగానూ 836 పరిష్కారమయ్యాయి.
- 13వ వార్డులో 694 దరఖాస్తులకు గానూ 637 పరిష్కారమయ్యాయి.
- 14వ వార్డులో 722 దరఖాస్తులకుగాను 678 పరిష్కారమయ్యాయి.
- 15వ వార్డులో 1248 దరఖాస్తులకు గానూ 1167 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

ఇబ్బందులు తొలగిపోయాయి



మా కుటుంబంలో నాతో పాటు నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.ఉమ్మడి కుటుంబంకావడంతోసంక్షేమ పథకాలు పొందలేకపోయాం . సురక్ష కార్యక్రమం ద్వారా వార్డు సచివాలయం ఉద్యోగులు, వలంటీర్‌ను ఆశ్రయించి సమస్య వివరించారు. కుటుంబ విభజన సర్టిఫికెట్ కావాలని వివరాలను తెలియజేశారు.రెండు రోజుల్లోనే పిలిచి కుటుంబ విభజన సర్టిఫికెట్ అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.

– జి.రవికుమార్, హవన్నపేట కాలనీ, ఆదోని

ఒక్కరోజులోనే సర్టిఫికెట్



గతంలో కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందాలంటే వారం, పది రోజులపాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. అయితే సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ వచ్చినప్పటి నుంచి సమస్యలు చకచకా పరిష్కారమవుతున్నాయి. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం గురువారం దరఖాస్తు చేశాను. శుక్రవారం సర్టిఫికెట్ సులువుగా, ఉచితంగా అందించారు. ఇంత కన్నా ఆనందం ఇంకేముంటుంది. ఇలాంటి ప్రభుత్వాలు మళ్లీమళ్లీ రావాలి.

– ఆర్.జమున, కౌడల్‌పేట కాలనీ, ఆదోని

ఉచితంగా ఇచ్చారు



మీ సేవ,నెట్ సెంటర్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఒక్కోదానికి రూ. 300 చొప్పున రూ.600 ఖర్చయ్యేది.అయితే జగనన్న సురక్ష పథకం ద్వారా ఉచితంగా, తొందరగా పొందవచ్చని వలంటీర్లు, వీధిలోని కొంత మంది పెద్దలు తెలిపారు. వారి సూచన మేరకు రెండు రోజులక్రితమే దరఖాస్తు చేశాను. మూడో రోజునే క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. తిరిగే ఇబ్బందులు, డబ్బులు ఆదా అయ్యాయి.

– అమీదాబి, కార్వన్‌పేట కాలనీ

ఉచితంగా ధ్రువపత్రాలు



హనుమాపురంలో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వి.తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లో సురక్ష కార్యక్రమం నిర్వహించి దరఖాస్తుదారులకు పలు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో మణిమంజరి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, సర్పంచులువీరారెడ్డి, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

పెద్దకడబూరు: రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి దరఖాస్తు చేసుకున్న ప్రజలకు సంబంధిత ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు తనిఖీ చేశారు. పిల్లలకు మంచి నాణ్యమైన పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. తహసీల్దారు వీరేంద్రగౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు విజయేంద్రరెడ్డి, ఈరన్న, పెద్దయ్య పాల్గొన్నారు.

అత్యాశకు పోయి మోసపోవద్దు



వగరూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం రూరల్: అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు గ్రామస్తులకు సూచించారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో తెదేపా కార్యకర్త వీరేష్ గ్రామస్తులతో కలసి రూ.2 కోట్ల మేర ప్రైవేటు సంస్థలో పెట్టుబడులు పెట్టడంపై ఈ నెల 5న 'సాక్షి' ప్రధాన సంచికలో 'అమేజ్‌లైఫ్ పేరుతో రూ.2కోట్లు కుచ్చుటోపీ' శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే'. దీనిపై స్పందించిన ఎస్ఐ వేణుగోపాల్‌రాజు వగరూరు గ్రామంలో శుక్రవారం స్థానికులతో సమావేశమయ్యారు. ఏజెంట్ల మాటలు నమ్మి నకిలీ కంపెనీల్లో డబ్బులు పెట్టొద్దని సూచించారు. ఇలాంటి కంపెనీల పేర్లతో ఎవరైనా సంప్రదించి ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

జగనన్నతోనే జనరంజక పాలన



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగి మండల పరిధిలోని జంపాపురం గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఆ సచివాలయం పరిధిలో రెండవ రోజున 415 ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వివరించారు. రానున్న 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పక్కరాష్ట్రాల మేనిఫెస్టోలను కాపీకొట్టి భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ ఆ పార్టీ నాయకులు బస్సు యాత్ర చేపట్టడం బూటకమని ఎద్దేవా చేశారు. టీడీపీ భవిష్యత్‌కు గ్యారంటీ లేదని, ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు.

త్వరలోనే కోసిగికి సాగు, తాగునీరు

పులికనుక రిజర్వాయర్ నుంచి కోసిగి ప్రాంతానికి త్వరలోనే పుష్కలంగా సాగు, తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. పులికనుమ మిగులు బడ్జెట్ కింద రూ.6 కోట్లతో కోసిగి పైప్‌లైన్ పనులు వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. అలాగే భూగేని చెరువు వద్ద పెండింగ్ పనులు వెంటనే చేయాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కోసిగి ప్రాంతాన్ని సస్యశ్యామలంగా చేసి చూపిస్తామన్నారు. కోసిగి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కేదారి ల్యాబ్ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు , బసిరెడ్డి, నరసింహులు, మంగమ్మ, సర్పంచ్ హారోన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు



పెద్దహరివాణంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: ప్రజా మద్దతుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయం అని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఐదోరోజు పెద్దహరివాణం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహంచారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో స్వాగతం పలికారు. గ్రామంలో కలియతిరిగి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామంలో మురుగు కాలువలు, డ్రెయినేజీలు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయా శాఖల అధికారులను పిలిపించి మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పరిపాలనలో మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చారని, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లో మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, సర్పంచ్ రాముడు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైతు ఆత్మహత్య

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం దిబ్బనదొడ్డి గ్రామానికి చెందిన బోయ పెద్ద హనుమంతు (53) అనే రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు శుక్రవారం తెలిపారు. హనుమంతు ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. వ్యవసాయంలో అప్పులు, నలుగురు పిల్లలకు పెళ్లిల్లు చేయడంతో రూ.పది లక్షల వరకు అప్పు అయ్యిందని, దాన్ని తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై పత్తి పంట కోసం తెచ్చిన పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. భార్య బోయ శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో ఉపాధి మేటి మృతి



మల్లికార్జున (ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామానికి చెందిన ఉపాధి మేటి అగ్రహారం మల్లికార్జున (22) గుండెపోటు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉపాధి కూలీలు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జున రోజులాగే గ్రామం వద్ద టవర్ నుంచి కోసిగి రోడ్డు వరకు జరుగుతున్న ఉపాధి పనులను వెళ్లాడు. పని ప్రదేశంలో కూలీల హాజరును మస్టర్‌లలో నమోదు చేసుకున్నాడు. అనంతరం అక్కడున్న కూలీలతో మాట్లాడి ఒంట్లో నలతగా ఉందని కళ్లు తిరుగుతున్నట్లు చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చి పడుకున్న మల్లికార్జునను మధ్యాహ్నం భోజనం చేసేందుకు భార్య ఉసేనమ్మ నిద్ర లేపేందుకు ప్రయత్నించగా నిర్జీవంగా ఉన్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి 5 నెలల కుమారుడు ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఏపీఓ రామన్న సిబ్బందితో వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు



ఆదోనిలోని ఓ హోటల్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్‌కుమార్

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని ఎనిమిది భోజన హోటళ్లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీ చేపట్టారు. రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పూజిత ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎనిమిది హోటళ్లను తనిఖీ చేసి రూ.1.90 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని 8 హోటళ్లలో అపరిశుభ్రత, శుభ్రంలేని పరికరాలు వాడడం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించి విధంగా ఆహారం తయారు చేస్తుండడంతో రూ.1.90 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. మున్సిపల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, విజిలెన్స్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఆదోని పట్టణం, ఆదోని మండలం, కౌతాళం మండలం పరిధిల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.

కోసిగి: మండల కేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ మరమ్మతు పనులు చేయిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

ఆదోని అర్బన్: రైతులు అగ్రికల్చర్ సప్లై కోసం ఎస్టిమేషన్ ఇచ్చి పేమెంట్ చేసిన రెండు నెలల్లోపే సర్వీసు సప్లై చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక డీఈ కార్యాలయంలో మంత్లీ రివ్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరి పరిధిలో వారు వంద శాతం కలెక్షన్ చేయాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రజలకు ఇబ్బందులకు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలో విద్యుత్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి సరఫరా చేయాలన్నారు. పల్లెల్లో లోఓల్టేజీ ఉంటే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలన్నారు. డీఈ సుధాకర్‌కుమార్, ఎస్ఏఓ రాఘవులు, ఏడీఈ పురుషోత్తం, ఏఈలు నాగభూషణం, నరసయ్య,చెన్నయ్య, శారద, సంతోష్ పాల్గొన్నారు.

జమ్మకాళమ్మ ఆలయ వార్షికోత్సవం



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్‌లో వెలిసిన జమ్మకాళమ్మ ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుంగభద్ర నుంచి తెచ్చిన జలాలతో రైల్వేస్టేషన్ నుంచి ఆలయం వరకు ప్రధాన రహదారులగుండా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొనగా డోలు, సన్నాయిల మధ్య తుంగభద్ర జలాలతో ఆలయానికి చేరుకున్నారు.అమ్మవారికి తుంగభద్ర జలాలతో జలాభిషేకం చేశారు. అదేవిధంగా పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ, మహామంగళహారతితో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

పట్టణశివారులోని మంగరాయ సన్నిధిలో శుక్రవారం జయతీర్థ ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ స్వామి సూచనల మేరకు ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో జయతీర్థ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జయతీర్థ చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయం చుట్టూ ఊరేగింపు చేపట్టారు. మంగరాయ ఆంజనేయస్వామికి ఫలపంచామృతాభిషేకం, వెండి పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. పూజారి గురురాజ ఆచారి, బ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

జయతీర్థుల ఆరాధనోత్సవాలు



బంగారు రథంపై జయతీర్థుల చిత్రపటం ఊరేగింపు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల మధ్యారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం కర్ణాటకలోని గంగావతి తాలూకా ఆనెగొంది క్షేత్రంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా జయతీర్థుల బృందావనంకు పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థుల విశేష పంచామృతాభిషేకం పుష్పలంకరణలు గావించి మంగళహారతులతో శాస్త్రోత్తకంగా పూజోత్సవాలు కానిచ్చారు. ఆనెగొందిలోని ఆశ్రమంలో జయ, దిగ్విజయ, మూలరాముల సంస్థాన పూజలు గావించారు. అనంతరం జయతీర్థుల చిత్రపటాన్ని చెక్క రథంపై కొలువుంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అలాగే మంత్రాలయం మఠంలో జయతీర్థుల మధ్యారాధన వేడుకలు నిర్వహించారు. జయతీర్థుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు రథంపై కొలువుంచి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీ మఠం మేనేజర్లు ఎస్.కె.శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, విద్యాపీఠం ప్రధానాచార్యులు వాదిరాజాచార్, ధార్మిక సహాయ అధికారి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: మండలంలోని మదిరె గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి సచివాలయం ముందు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలన్నారు. అలాగే 2001లో 141 దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, నేటికీ స్థలాలు చూపించలేదని వాపోయారు. ఎస్సీ కాలనీలోని మాలగేరి, బీసీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాణికంఠ, రామంజి, నరసింహ ఆధ్వర్యంలో ఇంద్రనగర్ కాలనీలో జెండను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ జిల్లా నాయకులు వీరేష్, ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగన్, టి.ఈరన్న పాల్గొని మాట్లాడారు. దళితుల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ 29 సంవత్సరాలుగా పోరాటాలు చేస్తోందన్నారు. ఈనెల 15న మందకృష్ణ ఆధ్వర్యంలో ఆదోనిలోని రీక్రియేషన్ క్లబ్‌లో జరగబోయే సన్నాహక సభకు మాదిగ సోదరులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మధుబాబు, చలపతి, మనీ, అర్జున్, మహేంద్ర, చిన్న, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి దేశభక్తి, కమశిక్షణ కలిగి ఉండాలని ఎన్‌సీసీ 28వ బెటాలియన్ సెలెక్షన్ అధికారులు సురేష్‌తాలా, ధనుంజయరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీలో పురపాలక ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ శిక్షణ కోసం విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదవుతో పాటు క్రీడలు అవసరమన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు దేహ దారుఢ్య పరీక్షలను నిర్వహించి నెహ్రూ మెమోరియల్ పాఠశాల నుంచి 25 మందిని, ఆర్ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాల నుంచి 25 మందిని ఎంపిక చేశారు. పీఈటీలు రామకృష్ణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై అపోహలు వద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి 'జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం' భూ యజమానులకు వరం అని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం మండలంలోని బసాపురంలో గ్రామసభ నిర్వహించి రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలు పరిష్కరించడంతో పాటు, రైతులందరికీ కచ్చితమైన కొలతలతో భూహక్కు పత్రాలు అందించడమే లక్ష్యంగా సమగ్ర సర్వే చేపట్టిందన్నారు. రీసర్వేపై ప్రజలు ఎలంటి అపోహాలు పెట్టుకోవద్దన్నారు. భూమిని సమగ్ర సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు రికార్డులను డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలకు రీసర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. మండల సర్వేయర్ రమణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.